ఈనాడు
epaper.eenadu.net

# కేంద్రానికి చేరిన మెట్రో డీపీఆర్‌లు

- సోమవారం రాత్రి సమర్పణ
- అనుమతుల జారీ, నిధుల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం ఆశలు



ఈనాడు, హైదరాబాద్: మెట్రోరైలు రెండో దశ మొదటి భాగం (పార్ట్-ఏ) సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు సోమవారం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఐదు కారిడార్లలో 76.4 కి.మీ. గానూ రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. డీపీఆర్‌లతో పాటూ హెచ్ఎండీఏ పరిధి వరకు సిద్ధం చేసిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ) ట్రాఫిక్ అధ్యయన నివేదిక, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పరిపాలన అనుమతులు జత చేసి పంపారు.

**సంయుక్త ప్రాజెక్టుగా..** మెట్రోరైలు రెండో దశ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టాలని జులైలో సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ వెళ్లి సంబంధిత మంత్రికి విజ్ఞప్తి చేశారు. త్వరలో డీపీఆర్‌లను సమర్పిస్తామని చెప్పారు. అందుకనుగుణంగా జులై 26న మంత్రి మండలిలో ఆమోదం, నవంబరు 2న పరిపాలన పరమైన అనుమతులు జారీ చేసి నవంబరు 4న కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపారు.

**నిధుల సేకరణ..**వ్యయంలో రూ.7,313 కోట్లు (30 శాతం) రాష్ట్రం భరించనుంది. రూ.4,230 కోట్లు (18 శాతం) కేంద్రం భరించాలని రాష్ట్రం కోరుతోంది. 48 శాతం రూ.11,693 కోట్లను రుణంగా, 4 శాతం పీపీపీ ద్వారా సమకూర్చుకోనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా పరిధిలో నిర్వహించిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) కేంద్రం పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది. ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేందుకు.. సీఎం త్వరలోనే దిల్లీ వెళ్లి కేంద్రం పెద్దలకు పరిస్థితిని వివరించనున్నారు.

**తక్కువ వడ్డీకి రుణాలు..** 'మెట్రో రెండోదశపై సీఎం రేవంత్‌రెడ్డి చాలా శ్రద్ధ కనబరుస్తున్నారు. సీఎం సూచన మేరకు డీపీఆర్, సీఎంపీ ప్లాన్‌లను కేంద్రానికి పంపించాం. కేంద్ర ప్రభుత్వ సావరిన్ గ్యారంటీతో రెండుశాతం కంటే తక్కువ వడ్డీరేట్లకు రుణం పొందడం ద్వారా ప్రాజెక్టును తక్కువ వ్యయంలో పూర్తిచేసేందుకు అవకాశం ఉంటుంది' అని ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

**మెట్రో రెండో దశ విస్తరణ కారిడార్ల వారీగా..**

| కారిడార్ | మార్గం | దూరం |
|---|---|---|
| 4 | నాగోల్- శంషాబాద్ విమానాశ్రయం | 36.8 కి.మీ. |
| 5 | రాయదుర్గం- కోకాపేట నియోపోలీస్ | 11.6 కి.మీ. |
| 6 | ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట | 7.5 కి.మీ. |
| 7 | మియాపూర్- పటాన్‌చెరు | 13.4 కి.మీ. |
| 8 | ఎల్బీనగర్- హయత్‌నగర్ | 7.1 కి.మీ. |

Date : 06/11/2024 EditionName : GREATER HYDERABAD PageNo :